క్లుప్తంగా

సన్మానం



శ్రీనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న యువకులు

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా రాజన్నసిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని పోరాటం చేసిన యువజన సంఘాల నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డికి మంగళవారం ఖాసీంపేట గ్రామ యువకులు శాలువాతో సన్మానం చేశారు. ప్రజల పక్షాన పోరాటంతోనే రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో ఏలేటి సతీష్‌రెడ్డి, సింగిరెడ్డి శేఖర్‌రెడ్డి, బొజ్జ సందీప్, బద్దం ముఖేశ్‌రెడ్డి, సింగిరెడ్డి మహిపాల్‌రెడ్డి, దంతు, శశివర్దన్, రోహిత్ పాల్గొన్నారు.

తారురోడ్డు పనులు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న సుడా చైర్మన్

మానకొండూరు: మండలంలోని అన్నారం, మానకొండూరు తారురోడ్డు పనులను సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు మంగళవారం ఆర్ అండ్‌బీ, మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. అన్నారంలో మురుగు కాలువ, కల్వర్టు, తారురోడ్డు గ్యాప్ పనులు, రహదారి వెంట విద్యుత్ లైన్ల తొలగింపు, మిషన్ భగీరథ పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజ్, కిషన్, ఆర్అండ్‌బీ ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ శిరీష విద్యుత్ అధికారులు, ఉపసర్పంచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

చిగురుమామిడి: గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలతో జీపీడీపీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ఈనెల చివరివారం వరకు గ్రామసభలు నిర్వహించాలని, ప్రజల ఆమోదం అనంతరం జీపీడీపీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గీకురు రవీందర్, టీఓటీ కిరణ్ కుమార్, ఎంపీడీఓ నర్సయ్య, ఎంపీఓ శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీల సమావేశం



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

రామడుగు: మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో మంగళవారం చొప్పదండి నియోజకవర్గంలోని బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్ కార్నర్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సుద్దాల దేవయ్య, బొడిగె శోభ, పార్లమెంట్ నియోజక వర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, మండలశాఖ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిధులు రికవరీ చేయాలి

వీణవంక: దుర్వినియోగమైన మండలంలోని బొంతుపల్లి గ్రామ పంచాయతీ నిధులు రికవరీ చేయాలని మాజీ ఉపసర్పంచ్ చదువు జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో మాట్లాడారు. 2018 నుంచి 2020 వరకు ఎలాంటి ఆధారులు లేకుండా రూ.1.80లక్షలు పోర్జరీ సంతకాలతో డ్రా చేశారని ఆరోపించారు. డబ్బులు రికవరీ చేయకుంటే చట్టపరమైన చర్యలకు వెళ్తామని స్పష్టం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కంటి వెలుగు పోస్టర్‌ను ఎంపీవో ప్రభాకర్ ఆవిష్కరించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడారు. బుధవారం నుంచి రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు వరుణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

సొంత భవనాలకు మోక్షమెన్నడో..?

- ఇరుకు గదులు.. అద్దె ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- మౌలిక వసతులు లేక అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అసంపూర్తిగా కొండపాక అంగన్‌వాడీ కేంద్రం

వీణవంక: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఇరుకు గదులు, అద్దె ఇళ్లలో కనీస మౌలిక వసతులు లేక టీచర్లు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. అద్దె, ఇరుకు, పాడువడిన భవనాల్లో కాలం వెల్లదీయాల్సిన దుస్థితి తలెత్తింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందించే టీచర్లు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సేవలను గుర్తించిన ప్రభుత్వం ఇటీవల జీతాలను పెంచడంతో పాటు అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తింపునిచ్చింది. అయితే కేంద్రాల్లో మాత్రం వసతులు లేక లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలో 26గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 48అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరు టీచర్లతో పాటు ఆయా పోస్టు ఖాళీగా ఉంది. గర్భిణులు 280, బాలింతలు 218, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 1,065మంది, మూడు నుంచి ఐదేళ్లలోపు 691, ఐదు నుంచి ఆరేళ్లలోపు 22 మంది ఉన్నారు.

వేధిస్తున్న మౌలిక వసతులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుబంధ పోషకాహారం ఇవ్వడంతో పాటు పూర్వ ప్రాథమిక, ఆరోగ్య పోషణ విద్యను నేర్పించాలి. బాలింతలకు, గర్భిణుల కో 'ఆరోగ్య లక్ష్మి' పథకంలో భాగంగా ఒక పూట సంపూర్ణ పోషకాహార పథకం 2014లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో బాలింతలు, గర్భిణుల సంఖ్య పెరిగింది. అయితే కేంద్రాల్లో సరిపడా గదులు, మంచినీటి వసతి, ఆహ్లాదకర వాతావరణం లేకపోవడంతో సెంటర్లకు రావడానికి వారు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మల్లారెడ్డిపల్లి అంగన్‌వాడీ సెంటర్ ప్రభుత్వ పాథమిక పాఠశాలలో కొనసాగుతోంది. ఇందులో ఒకే గది ఉండగా ఇక్కడ చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉంది. టీచర్, ఆయా సమష్టి కృషితో చిన్నారుల సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నారు. కానీ ఇక్కడ భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కొన్ని కేంద్రాలలో ప్రహరీ లేకపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. 14 కేంద్రాల్లో కనీసం ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేయలేదు. చిన్నారులు ఉక్కపోత తట్టుకోలేకపోతున్నారనే ఫిర్యాదులు వెలువడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో నడిచే భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. టీచర్లు రాజీ పడకుండా పోషకాహారం అందిస్తున్నా... క్షేత్రస్థాయిలో మౌలిక వసతులు లేక చిన్నారులను కేంద్రాలకు పంపించడానికి తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శశికిర్మణయిని వివరణ కోరగా అన్ని సెంటర్లలో పౌష్టిక ఆహారం అందిస్తున్నాం, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. 14కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్న మాట వాస్తవం ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు	
సొంత భవనాల్లో	5
అద్దె ఇళ్లలో	14
ప్రభుత్వ స్కూళ్లలో	29
మొత్తం	48

ఇబ్బంది పడుతున్నారు



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు ఇంత వరకు చర్యలు చేపట్టలేదు. ఇరుకు గదుల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని భవనాల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేవు. అంగన్‌వాడీ టీచర్లు ఎంతో సేవా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా భవనాలు నిర్మించి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలి.

– చింతల శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మామిడాలపల్లి

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితరులు

గంగాధర: ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటూ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 69 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య ఖర్చులకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ అందుతుందన్నారు. రాష్ట్రం ఏర్పాటుకు ముందు ప్రజలు సాయానికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రా మాల సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా రుణమాఫీ ఊసేలేదు

గన్నేరువరం: గడపగడపకూ కాంగ్రెస్, పల్లె పల్లెకూ కవ్వంపల్లి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చీమలకుంటపల్లె గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ పాలనలో నిరుపేదలకు ఇండ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను టీఆర్ఎస్ ప్రభుత్వం నేటి వరకు పూర్తిగా చేపట్టకపోవడం సిగ్గు చేటన్నారు. నాలుగేళ్లుగా రుణమాఫీ ఊసేలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే పేదలు, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి ములక్కల మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చాడ సతీష్‌రెడ్డి, తుమ్మ చందు, బామండ్ల అంజనేయులు, బామండ్ల తిరుపతి, రాజయ్య పాల్గొన్నారు.



చీమలకుంటపల్లెలో కవ్వంపల్లి ప్రచారం

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

ఇల్లందకుంట: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెసప పార్టీ మండల కో ఆర్డినేటర్ మడుపు మోహన్‌చారి అన్నారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని టేకుర్తి, గడ్డివానిపల్లి, సీతంపేట, బూజునూరు, వంతడ్పులలో గ్రామ కమిటీలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఈ నెల 26 నుంచి రేవంత్‌రెడ్డి చేపట్టనున్న పాదయాత్రకు మద్దతుగా ఎక్కడి వారు అక్కడే వారి గ్రామాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలోపార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మండల నాయకులు రామారావు, వంగ రామకృష్ణ, మహేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



జమ్మికుంట: ఆర్థికసాయం అందిస్తున్న వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు



చొప్పదండి: ఆర్థిక సాయం అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి రామన్నపల్లి గ్రామంలో ఆర్ఎంపీగా సేవలందించిన బెజ్జంకి నాగరాజు ఇటీవల మృతి చెందారు. వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పైడిపల్లి భీమన్న ఆధ్వర్యంలో మృతుడి భార్య శకుంతలకు రూ.10,000 మంగళవారం అందజేశారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గ్యారంపెల్లి రాజేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు వేముల అశోక్, మాచినపల్లి గోపీ, కోశాధికారి అప్పల సదానందం, సభ్యులు నాగేశ్వర్‌రావు, తిరుపతి, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన రైతు ఆకుల ఆదిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. చొప్పదండి పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి మంగళవారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆపదలో సంఘం సభ్యులను ఆదుకుంటున్నామని, సంఘం తరుపున భీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కొన్న తిరుపతిరెడ్డి, రెవెళ్లి బాలయ్య, దుర్గం పద్మ, అప్పిడి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మత్స్యగిరీంద్రస్వామి ఆలయానికి రూ.3.56లక్షల ఆదాయం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయానికి వేలం ద్వారా రూ.3.56లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో సుధాకర్ తెలిపారు. మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం వేలం పాట నిర్వహించారు. వేలంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి రూ.1.70 లక్షలు, కొబ్బరి ముక్కలు పోగు రూ.46వేలు, వాహనాల పార్కింగ్‌కు రూ. 1,40,516 వచ్చినట్లు పేర్కొన్నారు.

వైభవంగా శ్రీచండీ మహా యాగం



యాగం నిర్వహిస్తున్న వేదపండితులు

రామడుగు: మండలంలోని వెదిర శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో మంగళవారం శ్రీ చండీ మహాయాగం కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. కార్యక్రమాన్ని వేదపండితులు రోహిత్ త్రిపాఠి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు చేశారు. సర్పంచ్ తీగల సంగీత, వీడీసీ రాజశేఖర్‌గౌడ్, దేవాలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. చండీ యాగం కార్యక్రమాలు ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సంస్కృత దీక్షయజ్ఞం విజయవంతం చేయాలి

సైదాపూర్: మండలంలోని సోమారం చౌరస్తాలో బుధవారం నిర్వహించే సంస్కృత దీక్షయజ్ఞం కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు అనగోని శ్రీనివాస్ కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే యజ్ఞంలో ప్రతి హిందూవు పాల్గొన్నాలన్నారు. కార్యక్రమానికి వీహెచ్‌పీ ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

కోతకు గురవుతున్నా పట్టింపేదీ..?

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోని డీ89 ఉపకాలువ మొదటి వంతెన వద్ద కాలువ గట్టు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రోజురోజుకు గట్టు కోతకు గురవుతోందని, అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. మరమ్మతు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.



ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో రైతులకు వరిలో వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను మంగళవారం ఏడీఏ గుండా సునీత వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయనిక ఎరువులను వేయొద్దని, సేంద్రియ ఎరువులపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామైక్య సంఘాల మహిళలతో సమావేశమై పంట మార్పిడిలో భాగంగా ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో సతీష్‌రెడ్డి, వీఆర్ఏ సదానందం, రైతులు ఉన్నారు.

మల్బరీ తోటల పరిశీలన

మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో మల్బరీ తోటలను మంగళవారం డివిజన్ పట్టు పరిశ్రమ అధికారి మహమ్మద్ రషీద్, జమ్మికుంట కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త వేణుగోపాల్ పరిశీలించారు. ఈసందర్భంగా మల్బరీ తోటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు రైతులకు వివరించారు.



మల్బరీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలి



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: మండలంలోని అన్నారం ఉన్నత పాఠశాలలో పురుషుల సీనియర్ జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ జీవీ రామకృష్ణారావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షణలో మెలకువలు నేర్చు కోవాలని, భూపాలపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి ఎక్కువ మంది ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. శిక్షణ శిబిరానికి సర్పంచ్ శ్రీ బొట్ల కిషన్, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, ఎంపీటీసీ రాజనర్సు, మానకొండూరు సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, గ్రామ మాజీ సర్పంచ్ పడగంటి వీరేశం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పురం అనిల్, పాఠశాల ఉపాధ్యాయులు వీరాచారి, శ్యామ్ రాజ్, పాఠశాల శిక్షణ, నిర్వహణ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, యువకులు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.



విజేత జట్టుకు కప్ అందిస్తున్న ఎస్సై సుధాకర్

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

చిగురుమామిడి: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని చిగురుమామిడి ఎస్సై దాస సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని నవాబుపేట్‌లో సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గెలుపొందిన గుడివాడ జట్టుకు ఏడువేల నగదు, కప్, రన్నర్ జట్టుకు కప్‌తో పాటు రూ.3,500 నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, స్పాన్సర్స్ కాంతాల తిరుపతిరెడ్డి, దేవసాని కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్, సది, శ్రీనివాస్, పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కొండి సప్త రుషి, గూల్ల రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌రూరల్: అంధత్వ నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఇరుమల్ల రాణి స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా విజయవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దృష్టి లోపంతో బాధపడుతున్న వారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి శిబిరానికి ఆధార్‌కార్డుతో వచ్చి పరీక్షలు చేయించుకొని అద్దాలు తీసుకోవాలన్నారు. శిబిరంలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఇరుమల్ల రాణి

రామడుగు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామాల్లో నిర్వహించే శిబిరాలు విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కలిగేటి కవిత కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో కంటి వెలుగు, మిషన్‌భగీరథ, జీపీడీపీలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకవచ్చారు. సమావేశంలో ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



సమావేశంలో కార్యదర్శులు, తదితరులు

శంకరపట్నం: గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శంకరపట్నం, వీణవంక, సైదాపూర్ మండలాల గ్రామపంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో లత, ఎంపీడీవో బషీరొద్దీన్ ఉన్నారు.

పరామర్శ

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు రావుల హరీశ్ తండ్రి రావుల రాములు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం పాలకుర్తి జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకురాలు కందుల సంధ్యారాణి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మల్యాల గ్రామ సొసైటీ చైర్మన్, వీరస్వామి, వార్డు సభ్యుడు సతీష్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

పాపయ్యపల్లి ఉపసర్పంచ్‌గా రాము



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా గుండేకారి రాము ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో కల్పన మంగళవారం తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ వజ్జపెల్లి కవితపై వార్డు సభ్యులు అవిశ్వాసం పెట్టి తొలగించారు. నూతన ఉపసర్పంచ్ ఎన్నిక కోసం గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఆగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎనిమిది మంది వార్డు సభ్యులకు ఒకరు గైర్హాజరుకాగా ఉపసర్పంచ్ అభ్యర్థితోపాటు ఆరుగురు వార్డు సభ్యులలు ఉపసర్పంచ్‌గా గుండేకారి రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు సభ్యుల పూర్తి మద్దతుతో రామును ఉపసర్పంచ్‌గా ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో సతీష్‌కుమార్, కార్యదర్శి క్రాంతికుమార్, వార్డు సభ్యులు మీసాల శంకర్, ఆరెపల్లి స్వరూప, గుండేకారి సరోజన, తొర్నే సంజీవరావు, సూరం రవీందర్, శనిగరపు స్రవంతి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

హుజూరాబాద్: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన నాగరాజు సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజన్న టెక్నాలజీ సహాయంతో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నాగరాజుకు పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు.